సాక్షి
వరంగల్
మంగళవారం | 18 | జూలై | 2023



బస్సును ఢీకొన్న వ్యాన్ - 8లో▸
వర్ధన్నపేటలో ఆర్టీసీ బస్సును డీసీఎం వ్యాన్ ఢీకొంది. ఈఘటనలో క్యాబిన్‌లో ఇరుక్కుని వ్యాన్ డ్రైవర్ మృతి చెందాడు. నలుగురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. - 8లో▸



కరెంటోళ్లకు కోపమొచ్చింది!
సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులకు కోపమొచ్చింది. వర్ధన్నపేట మండలంలో రైతుల స్టార్టర్లు, విద్యుత్ తీగలు స్వాధీనం చేసుకున్నారు. - 9లో▸


వాతావరణం
గరిష్టం/కనిష్టం
$27^0/24^0$
జిల్లాలో వాతావరణం ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా కుండపోతగా వర్షం కురుస్తుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

వర్ధన్నపేటపై కాంగ్రెస్ కన్ను!

స్థానిక, ఆర్థిక, కుల, బల సమీకరణాలున్న అభ్యర్థిపై గురి

- తాజాగా తెరపైకి రిటైర్డ్ ఐపీఎస్ కేఆర్ నాగరాజు పేరు
- 'క్యాంప్ లైన్స్ బాయ్స్' పేరిట ఆత్మీయ సమ్మేళనం
- పార్టీ పేరు చెప్పకపోయినా.. రాజకీయాల్లోకి వస్తున్నానని స్పష్టీకరణ
- ఇంకోవైపు మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పేరు కూడా వినిపిస్తున్న వైనం
- బీఆర్ఎస్, ఎమ్మెల్యేపై వ్యతిరేకత కలిసొస్తుందంటున్న పార్టీ శ్రేణులు


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న నాగరాజు



సాక్షి, వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పక్కా వ్యూహరచనతో వెళ్తోంది. ఇప్పటికే వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వర్ధన్నపేటకు చెందిన ఎర్రబెల్లి స్వర్ణను నియమించిన పార్టీ అధిష్టానం.. ఇక్కడి నుంచి బరిలోకి దింపే అభ్యర్థి విషయంలోనూ ఆర్థిక, కుల, స్థానిక, పరిచయాలు ఉన్న వారిని ఎంపిక చేసి గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని పావులు కదుపుతోంది. కొద్ది రోజులుగా వరంగల్ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కొండేటి శ్రీధర్ కాంగ్రెస్‌లోకి వచ్చే అవకాశముందని వార్తలొచ్చాయి. తాజాగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతోపాటు రిటైర్డ్ ఎస్పీ, ఎస్సీ మాల వర్గానికి చెందిన కేఆర్ నాగరాజు పేరు వినిపిస్తోంది. ఇందులో భాగంగానే మామునూరు క్యాంపులో ఆదివారం జరిగిన 'క్యాంప్ లైన్స్ బాయ్స్' ఆత్మీయ సమ్మేళనం ఈయన పొలిటికల్ ఎంట్రీని ఖరారు చేసింది. మీకు మేం అండగా ఉంటాం.. మీరు రాజకీయాల్లోకి రండి' అంటూ ఈ ఆత్మీయ సమ్మేళనంలో మిత్రులందరూ ప్రతిపాదించడాన్ని బట్టి చూస్తుంటే నాగరాజు వర్ధన్నపేట గడ్డ వేదికగా పోరుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. కొల్లాపూర్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సమక్షంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డి, మరికొందరు నేతలతోపాటు కేఆర్ నాగరాజు కూడా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెళ్లనుండడంతో ఆయన చేరిక లాంఛనమేనని స్థానిక నేతలు అంటున్నారు.

మళ్లీ వర్ధన్నపేట నుంచే...

స్థానికుడితోపాటు వర్ధన్నపేటలోనే ప్రొహిబిషనరీ ఎస్సైగా 1990లో పోలీస్ కెరీర్ ప్రారంభించిన నాగరాజు.. ఇప్పుడు అక్కడి నుంచే రాజకీయ ప్రస్థానం మొదలెట్టేలా వ్యూహరచన చేస్తున్నారు. స్పెషల్ పార్టీలో పని చేసిన సమయంలోనూ ఇక్కడ చాలామందితో పరిచయం ఉంది. స్కూలింగ్ మామునూరు పోలీస్ క్వార్టర్స్‌లో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు, ఆ తర్వాత పది వరకు రంగశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు హనుమకొండలో చదివారు. ఉమ్మడి వరంగల్‌లో వర్ధన్నపేట ప్రొహిబిషనరీ ఎస్సై, నెక్కొండ, కేయూసీ, మొగుళ్లపల్లి, స్పెషల్ పార్టీ, మిల్స్ కాలనీ, పరకాలలో ఎస్ఐగా, ములుగు, సుబేదారి, సీఐడీ వరంగల్, పాలకుర్తిలో సీఐగా, డీఎస్పీగా వరంగల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జనగామలో పనిచేశారు. ఆతర్వాత హైదరాబాద్‌లో వివిధ హోదాల్లో పనిచేసి మళ్లీ వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీగా, ఆ తర్వాత ఐపీఎస్ వచ్చాక నిజామాబాద్ కమిషనర్‌గా పనిచేసి 2023 మార్చి 21న రిటైర్డ్ అయ్యారు. హాకీలోనూ జూనియర్, సీనియర్ నేషనల్స్ ఆడిన కేఆర్ నాగరాజు ఎక్కువ సమయం మాత్రం మామునూరుకే కేటాయించారు. ఇప్పటికే మామునూరు క్యాంప్‌నకు ఆనుకొని ఉన్న లక్ష్మీపురంలో ఇల్లు నిర్మించుకొని ఇక్కడే ఎక్కువ సమయం గడుపుతున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే అరూరిపై ఉన్న వ్యతిరేకతకు తోడు కాంగ్రెస్‌కి ఉన్న బలం, తన వ్యక్తిగత పరిచయాలు, బంధువులు, పోలీసు శాఖలో ఉన్నప్పుడు స్థానికంగా ఉన్న పరిచయాలు కలిసొస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ కూడా ఓ దఫా వర్ధన్నపేట నియోజకవర్గంలో సర్వే పూర్తిచేసినట్లు తెలిసింది.

గతంలోనూ పేరు వినిపించినా..

ఇప్పటికే కేఆర్ నాగరాజు పేరు కొన్నేళ్లుగా పొలిటికల్ సర్కిల్‌లో వినిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీనుంచే వరంగల్ ఎంపీగా పోటీచేస్తారని గుసగుసలు వినిపించినా.. చివరకు హస్తం పార్టీ నుంచి వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ పార్టీలో ఉన్న వర్గపోరు వల్ల ఎంపీగా పోటీ చేస్తే ప్రయోజనం ఉండదనుకున్న కేఆర్ నాగరాజు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పోటీచేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీనుంచి నమిండ్ల శ్రీనివాస్ వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలు చూసుకుంటున్నా ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కావాల్సిన ఆర్థిక వనరులు లేకపోవడం కూడా కేఆర్ నాగరాజుకు కలిసిరానుంది. ఇప్పటికే కేఆర్ నాగరాజు బరిలో ఉంటారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన సంకేతాలు ఇస్తున్నట్టుగా ప్రచారం ఉంది. ఇంకోవైపు మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పేరు కూడా పార్టీ శ్రేణుల్లో చక్కర్లు కొడుతోంది. దీనికితోడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు దంపతులు కూడా పార్టీని గెలిపించేవారికే సై అంటున్నట్టుగా ఉన్నారని తెలిసింది. దీంతో త్వరలోనే అభ్యర్థి ఎవరనేది తేలనుంది.

ఇప్పుడు 'అరూరి' వంతు..

వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో అసంతృప్తి సెగలు

- ఇప్పటికే వరంగల్ తూర్పులో పతాకస్థాయికి వ్యతిరేకత
- పరకాలలోనూ నాగుర్లకే టికెట్ ఇవ్వాలంటూ గళం
- తాజాగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు తాకిన సెగ
- పార్టీ వారినే ఇబ్బంది పెడుతున్నారు.. టికెట్ ఇవ్వొద్దని నిరసన
- మంత్రి ఎర్రబెల్లితోపాటు బోయినపల్లి ముందుకు పంచాయితీ

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో రాజకీయ అసంతృప్తి సెగలు చెలరేగుతున్నాయి. ఇప్పటికే వరంగల్ తూర్పులో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను వ్యతిరేకిస్తున్న వర్గీయులు తమలో ఒకరికి టికెట్ ఇవ్వాలని అంటుంటే.. పరకాల నియోజకవర్గంలోనూ ఉద్యమకారులకు అవకాశం ఇవ్వాలని, లేదంటే ఎమ్మెల్యే చల్లాకు టికెట్ ఇస్తే ఓడిస్తామంటూ ప్రత్యక్షంగానే అదే పార్టీకి చెందిన నాగుర్ల అనుచరులు వార్నింగ్ ఇస్తున్నారు. ఇప్పుడు ఇదే కోవలో ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న వర్ధన్నపేట నియోజకవర్గం వచ్చి చేరింది. రెండుసార్లు తిరుగులేని బంపర్ మెజారిటీతో గెలిచిన ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు ముచ్చటగా మూడోసారి విజయావకాశాలున్న నేపథ్యంలో సొంత పార్టీ వారే ఇప్పుడు తిరగబడుతున్నట్టు తెలిసింది. ఈసారి అరూరికి టికెట్ ఇస్తే సహకరించే ప్రసక్తే లేదని, అతను కాకుండా ఎవరికీ ఇచ్చినా కూడా బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకుంటామని వర్ధన్నపేట నియోజకవర్గంలోని కొందరు ముఖ్య నేతలు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఆదివారం కలిసి వివరించినట్టు తెలిసింది. ఇతరులతోపాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు భూములను దర్జాగా బెదిరించి కబ్జా చేయడం, పార్టీ విషయాల్లో ప్రశ్నించిన ఉద్యమకారులపైనా కేసులు పెట్టించడం, మట్టి దందాలో తమవారినే ప్రోత్సహించడంతోపాటు పార్టీలో తనకు ఇబ్బందికరంగా పరిణమిస్తామన్న వారిని వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఇరువురి వద్ద వాపోయినట్టు తెలిసింది. అరూరికి టికెట్ ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో సహకరించబోమని తేల్చి చెప్పినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇది జరిగిన మరుసటి రోజే సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ఎమ్మెల్యే అరూరి రమేష్ గంటకుపైగా భేటీ అయినట్టు తెలిసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఇన్నాళ్లూ బీఆర్ఎస్ పార్టీ కచ్చితమైన సీటు అనుకున్న వర్ధన్నపేట నియోజకవర్గంలో ఏం జరగబోతున్నదని ఆ పార్టీ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఒకవేళ అరూరి రమేష్ కాకుంటే అక్కడ సరైన అభ్యర్థి ఎవరన్నది తేలాల్సి ఉంది.

వర్షానికి కూలిన ఇల్లు

- నిరాశ్రయురాలైన దివ్యాంగురాలు

కాజీపేట: వర్షానికి కాజీపేట 63వ డివిజన్ అంబేడ్కర్ నగర్ కాలనీలోని ఓ పెంకుటిల్లు సోమవారం ఉదయం కూలిపోయింది. వల్లపు స్వరూప అనే మానసిక దివ్యాంగురాలు ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న పెంకుటిల్లు ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోడలు పూర్తిగా నానడంతో కూలిపోయింది. మొండి గోడల పక్కనే కవర్ కప్పుకుని పిల్లలతో ఉండేలా ఏర్పాట్లు చేసుకుంది. కాగా, కూలిన ఇంటిని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పరిశీలించి దివ్యాంగురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజగోపురం నిర్మాణానికి రూ.10లక్షల విరాళం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక శ్రీ రంగనాథస్వామి దేవాలయం రాజగోపుర నిర్మాణానికి ప్రముఖ ఆడిటర్ గోనికొండ సుధాకర్, శకుంతల దంపతులు సోమవారం రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అమావాస్య పురస్కరించుకుని ఆలయంలో చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి సురేశ్, ప్రధాన అర్చకులు కృష్ణామాచార్యులు తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

రేషన్ షాపుల తనిఖీ



నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని అన్ని రేషన్ షాపులను సెంట్రల్ విజిలెన్స్ కమిటీ సభ్యులు శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం నిత్యావసర వస్తువుల సరఫరా, ఇంకా కావాల్సిన వస్తువుల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో రేషన్ షాపులో 10 నుంచి 15 మంది కార్డుదారులకు పంపిణీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల సరాఫరాపై పూర్తి స్థాయిలో సలహాలు, సూచనలు అడిగారు. ఈసందర్భంగా రేషన్ డీలర్లకు ఇస్తున్న 80 రూపాయల కమీషన్ ఏమాత్రం సరిపోవడం లేదని, కనీసం రూ. 30వేలు జీతం అందించాలని, తరుగుదలను తగ్గించడానికి రెండు శాతం అదనపు కోటా ఇవ్వాలని ప్రజలు కోరుతున్నట్లు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దారవత్ మోహన్‌నాయక్ కేంద్ర కమిటీ సభ్యులను కోరారు. రేషన్ షాపుల ద్వారా మరిన్ని నిత్యావసర సరుకులు అందించి, సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీటీసీఎస్ వినోద్, కిరణ్, నర్సంపేట మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అనంతుల రాజకల రాంనారాయణ, డీలర్లు మంకయ్య, రమేష్, సంతోష్, తిరుమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి బీఫార్మసీ ఏడో సెమిస్టర్ సప్లిమెంటరీ

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఫార్మసీ 7వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 19న మొదటి పేపర్ ఇన్‌స్ట్రుమెంటల్ మెథడ్స్ ఆఫ్ అనాలసిస్, 21న రెండో పేపర్ ఇండస్ట్రియల్ ఫార్మసీ-2, 24న మూడో పేపర్ ఫార్మసీ ప్రాక్టీస్, 26న నాలుగో పేపర్ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయా తేదీల్లో పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్‌ది దేశంలోనే అతిపెద్ద ఉద్యమం



సంగెం: భారతదేశంలోనే అతి పెద్ద సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్‌దేనని ఎంఎస్పీ వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కట్ల రాజశేఖర్ అన్నారు. సోమవారం సంగెం మండలంలోని పల్లారుగూడలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 1994లో ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం వాటాల పంపిణీ కోసం మంద కృష్ణ ప్రారంభించిన ఉద్యమం నేటికీ కొనసాగుతోందని గుర్తు చేశారు. సమాజంలో నెలకొన్న సామాజిక ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపు మాపి సాంఘిక సమానత్వం సాధించడమే లక్ష్యంగా 29 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కక్కెర్ల కుమారస్వామి, ఉప సర్పంచ్ కోడూరి రఘు, యువసేన మాజీ జిల్లా అధ్యక్షుడు చాతల్ల రమేశ్, పోడేటి యాకయ్య, జియా, అబ్దుల్, పూర్ణయ్య, ప్రశాంత్, ఉపేందర్, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

సీపెట్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిలా వరంగల్: హైదరాబాద్ చెర్లపల్లిలోని భారత ప్రభుత్వ కళాశాలలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) సంస్థలో వివిధ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసంస్థ ప్రిన్సిపాల్ డైరెక్టర్, హెడ్ డాక్టర్. బి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పెట్రో రసాయనాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునేందుకు కనీస అర్హత పదో తరగతి అని పేర్కొన్నారు. టెన్త్‌తో అయితే మూడేళ్ల డిప్లొమా కోర్సులు, సైన్స్ డిగ్రీతో రెండేళ్ల పీజీ డిప్లొమా కోర్సులు, ఏదైనా డిప్లొమా అర్హతతో పోస్ట్ డిప్లొమా కోర్సులను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, ఆయా కోర్సులపై ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31 వరకు జరగనున్న స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఫోన్ 83740 64444,80931 40230 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

చరిత్ర తెలిపే బాధ్యత ఉపాధ్యాయులదే

- రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యవాహ్ రమేశ్


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యవాహ్ కాచం రమేశ్

విద్యారణ్యపురి: వాస్తవ చరిత్రను విద్యార్థులకు అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యవాహ్ కాచం రమేశ్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యకర్తల శిక్షణ శిబిరాన్ని సోమవారం హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈశిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను, ధర్మాన్ని భవిష్యత్ తరాలకు అందించే మహోత్తర శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్, సరస్వతీ విద్యాపీఠం ప్రాంతం శైక్షిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, సరస్వతీ శిశుమందిర్ ప్రాంత విద్యాపీఠం నుంచి వచ్చిన సీపీరెడ్డి, డాక్టర్ కోల రవికుమార్, టీపీయూఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిని వీరస్వామి, ఉప్పుల సతీశ్, ఆముదాల దాత మహర్షి, బత్తిని వెంకటరమణ, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పిన్నింటి బాలాజీరావు, బాధ్యులు మాచర్ల భిక్షపతి, ఎ.మనోజ్‌కుమార్, సామల కవిత, శ్రీదేవి, శైలజ, సరోజనీదేవి, సంగెం శ్రీనివాస్, రాంభూపాల్, బాబురావు, అమంచ దేవికుమార్, సత్యనారాయణ, జి.శ్రీనివాస్, రెండు జిల్లాల్లోని వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

రైతుల ఇళ్లకు నోటీసులు

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య


మాట్లాడుతున్న నరుకుడు వెంకటయ్య

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకులు అన్నదాతలకు నోటీసులు పంపుతున్నాయని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. సోమవారం వర్ధన్నపేటలో అఖిలపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఈరెల్లి శ్రీనివాస్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కి శ్రీకాంత్‌తో కలిసి వెంకటయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ. లక్ష వరకు రుణ మాఫీ కోసం రూ.21,557 కోట్లు అవసరమని వ్యవసాయాధికారులు, బ్యాంకర్లు తేల్చి చెప్పారన్నారు. రూ.37 వేల వరకు ఉన్న 5,42,609 మంది రైతులకు రుణం రూ.1206 కోట్లు మాత్రమే మాఫీ చేశారన్నారు. 31 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.20.35 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలున్న 20 లక్షల మంది రైతులను బ్యాంకర్లు డిఫాల్టర్ల జాబితా లో చేర్చడంతో వారి కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. రుణమాఫీ అమలులో జాప్యం చేయడంతో అసలు వడ్డీ కలిపి అన్నదాతలకు మోయలేని భారంగా మారిందన్నారు. రెన్యువల్ చేయకపోవడంతో రైతులు కొత్తగా సాగు కోసం అప్పు తీసుకునే పరిస్థితి లేదన్నారు. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను సంప్రదించాల్సి వస్తోందని పేర్కొన్నారు.

పిల్లలనుంచి ఫోన్ దూరం చేస్తేనే భవిష్యత్


మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ

సంగెం: తల్లిదండ్రులు పిల్లల నుంచి సెల్‌ఫోన్‌ను దూరం చేస్తేనే వారికి మంచి భవిష్యత్ ఇచ్చినవారవుతారని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ అన్నారు. సోమవారం సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో తరుణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంస్థ కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాలను వినియోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, ఎంపీటీసీ మల్లయ్య, సర్పంచ్‌లు వెంకటయ్య, శారద సంపత్, సీడబ్ల్యూసీ మెంబర్ మధు, తరుణి సంస్థ ప్రతినిధులు రణధీర్, పురుషోత్తం, మానస, భవాని, మౌనిక , జ్యోతి, అంజలి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మంటల్లో కాంగ్రెస్‌ను కాల్చేయాలి

- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై రైతు వేదికల ఎదుట నిరసన


దుగ్గొండి: ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి: వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందన్న టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డికి బుద్ధిచెబుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విద్యుత్ మంటల్లో కాల్చివేయాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కరెంటు విధానాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని రాంపూర్, నల్లబెల్లి రైతు వేదికల వద్ద బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి బైఠాయించి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఊటుగుల ప్రవీణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, మాజీ ఎంపీపీలు బానోత్ సారంగపాణి, కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ గొనెల పద్మ, సర్పంచ్‌లు చింతపట్ల సురేశ్, నానబోయిన రాజారాం, లావుడ్య తిరుపతి, గొనే శ్రీదేవి, రాజు, సిద్దురి రత్నాకర్‌రావు, ఎంపీటీసీ జన్ను జయరావు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డివి అబద్ధాలు..

దుగ్గొండి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతునని అబద్ధాలు చెబుతున్నాడని ఆయన ప్రింటింగ్ ప్రెస్ యజమాని అని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఇటీవల రేవంత్ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఎడ్లబండి నడుపుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో సభలో ఆయన మాట్లాడుతూ రైతులను అవమానించేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, రైతుబంధు మండల కో-ఆర్డినేటర్ తోకల నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ పల్లాటి జైపాల్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రేవంత్‌వి పిచ్చికూతలు చిల్లర విమర్శలు..

నర్సంపేట: 'పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డివి చిల్లర విమర్శలు, పిచ్చి కూతలు. కన్నూ మిన్నూ తెలియని అతడిని కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేయడం సిగ్గు చేటు' అని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌కు తల్లికి పెళ్లానికి తేడా తెలియదన్నారు. 'రాజీవ్‌గాంధీ భార్య ఇందిరాగాంధీ. ప్రధానమంత్రి, రాష్ట్రపతి పదవులను త్యజించి త్యాగానికి మారుపేరుగా నిలబడింది' అంటూ ఇందిరాగాంధీని రాజీవ్‌గాంధీ భార్య అంటూ సంబోధించడం శోచనీయమన్నారు. తల్లిని భార్యగా సంబోధించడం తల్లిని అవమానించడమేనన్నారు. ఇలాంటోడిని కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడిగా కొనసాగించడం సిగ్గు చేటన్నారు. ప్రజలు ఇలాంటోడి గురించి ఆలోచించి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.

రేపు వెజిటేరియన్ 2కే రన్

నయీంనగర్: హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు బుధవారం వెజిటేరియన్ మూమెంట్ ఆధ్వర్యంలో వెజిటేరియన్ 2కే రన్ నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'శాకాహారం అమృతాహారం - మాంసాహారం విషాహారం ' అనే నినాదంతో ఈ 2కే రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6నుంచి 9 గంటల వరకు రన్ ఉంటుందని, ఇందులో పాల్గొనే వారందరికీ ఉచితంగా టీషర్ట్స్, అల్పాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో దివ్య శ్రీనివాస్, కిషన్‌రావు, టి.శ్రీనివాస్, రవీందర్, బూర రాంచందర్, పి.ఉపేందర్‌రెడ్డి, తడక కుమారస్వామి, నిమ్మల శ్రీనివాస్, టీవీ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ మూడో స్థానం

- మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

ఖానాపురం: తెలంగాణలో నాలుగు వేల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆత్మహత్యల్లో దేశంలో మూడో స్థానంలో రాష్ట్రం నిలిచినట్లు లెక్కలు చెబుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సక్రమంగా విద్యుత్ అందించలేని అసమర్థ రాష్ట్ర ప్రభుత్వం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు ఇచ్చే రూ.3లక్షలను తీసుకోవద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తీసుకుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక నష్టపోతారన్నారు. ప్రభుత్వ పాఠశాలల దుస్థితి బాగా లేదని సీఎం మనవడు హిమాన్షు స్వయంగా చెప్పాడని అన్నారు. ఆరోగ్యశ్రీ డబ్బులు రాక ప్రైవేట్ ఆస్పత్రులు డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. 2017లో ఉచితంగా ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పిన కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ జల్లి మధు, మల్లారెడ్డి, ఖాసీం, సలీం, కనకదుర్గ, కుమార్, పుల్ల య్య, కొమ్ము రాములు, అటికె కుమార్, రవివర్మ పాల్గొన్నారు.

ఎగిరెగిరి పిచికారీ!

కాలికి బురద తాకదు. రసాయనాలు ఒంటికి అంటవు. ప్రత్యేక డ్రెస్ అవసరమే లేదు. పంటక్షేత్రంపై ఎగిరి మరీ పిచికారీ చేస్తుంది. అదే డ్రోన్ స్ప్రే ప్రత్యేకత. ప్రస్తుతం వ్యవసాయంలో వచ్చిన ఆధునిక పద్ధతుల్ని గ్రామీణ రైతులు అందిపుచ్చుకుంటున్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు పరుచూరి సుబ్బారావు సోమవారం ఎకరాకు రూ.300 చొప్పున అద్దె చెల్లించి తన ఏడెకరాల పంట పొలంలో డ్రోన్ ద్వారా గడ్డి మందు పిచికారీ చేయించాడు. - ఖానాపురం


పంటక్షేత్రంలో డ్రోన్‌తో మందు పిచికారీ

క్లుప్తంగా

హాస్టల్ భవనంపై నుంచి జారిపడిన విద్యార్థిని

● ఆస్పత్రికి తరలింపు

కేసముద్రం: హాస్టల్ మొదటి అంతస్తుపై నుంచి విద్యార్థిని ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిన సంఘటన ఇనుగుర్తిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా గోర్లపాడుకు చెందిన సౌమ్య ఇనుగుర్తి గురుకుల కళాశాలలో హెచ్ఈసీ సెకండియర్ చదువుతుంది. ఈ మేరకు మొదటి అంతస్తు నుంచి విద్యార్థినులతో కలిసి సౌమ్య కిందికి దిగుతుండగా, ప్రమాదవశాత్తు ఆమె కాలు స్లిప్‌కావడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న డయాస్‌పై పడింది. దీంతో ఆమె కుడి కాలుకు గాయం కాగా హుటాహుటిన మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని అధ్యాపకులు తెలిపారు. సౌమ్య కావాలనే మొదటి అంతస్తు నుండి దూకినట్లు అక్కడున్న తోటి విద్యార్థినులు చెబుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. జరిగిన ఘటనపై అధికారులు విచారణ జరుపనున్నట్లు తెలిసింది.

అధికారులపై తేనెటీగల దాడి

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని లక్ష్మీబ్యారేజీ వద్ద అధికారులపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. జిల్లా సివిల్ జడ్జి జయరాం, ఎస్పీ సురేందర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పలిమెల మండలంలో న్యాయ సహాయ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వెళ్లి వస్తున్నారు. తిరుగు ప్రయాణంలో లక్ష్మీబ్యారేజీ వీక్షించడానికి వెళ్లగా అక్కడ తేనెటీగలు ప్రాజెక్టు గోడకు తెట్టె పెట్టి ఉంది. వరద తాకిడికి తేనెటీగలు ఒక్కసారిగా లేచి స్వైరవిహారం చేయడంతో ఎస్సై రాజ్‌కుమార్, కోర్టు పీపీ, ఇద్దరు సిబ్బంది, కానిస్టేబుల్‌పై దాడి చేశాయి. జడ్జి, ఎస్పీలకు తేనెటీగల దాడి జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గాయపడిన వారిని మహాదేవపూర్ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

నేటి నుంచి శ్రావణ మాసం షురూ!

● అధిక మాసంతో రెండు నెలలు శ్రావణమే
● 18 నుంచి ఆగస్టు 16 వరకు అధిక మాసం
● ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిజశ్రావణం
● రెండు నెలల పాటు లక్షపత్రి పూజలకు అవకాశం
● శివనామస్మరణతో మార్మోగనున్న కాళేశ్వరాలయం



కాళేశ్వరం : మహాశివునికి ప్రీతికరమైన మాసం శ్రావణమాసం. రెండు నెలల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో మంగళవారం ప్రారంభం కానుంది. ఈ ఏడాది అధికమాసం రావడంతో జూలై 18 నుంచి ఆగస్టు 16 వరకు అధికమాస శ్రావణం, ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిజ శ్రావణ వచ్చినట్లు వేదపండితులు చెబుతున్నారు. ఈ రెండు నెలల పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శివనామస్మరణతో మారుమోగనుంది.

అధిక మాసం అంటే :
శాస్త్రం ప్రకారం కాలగణన సూర్యుడు, చంద్రుల ఆధారంగా జరుగుతుంది. సూర్యుడి ఆధారంగా లెక్క కట్టే కాలమానాన్ని 'సౌరమానం'అని, చంద్రుని ఆధారంగా లెక్కకట్టే కాలమానాన్ని 'చంద్రమానం' అంటారు. చంద్రమానంలో నెలకు 29.53 రోజులు. దీని ప్రకారం చంద్రమానం ఏడాదికి 354 రోజులు. సౌరమానంలో ఏడాదికి 365 రోజులు. సౌరమానానికి, చంద్రమానానికి మధ్య ఏడాదిలో 11 రోజులు తేడా ఉంది. ఈ మధ్య తేడాను సరి చేయడానికి 32 నెలలకోసారి ఈ మాసాన్ని అధికంగా కలుపుతారు. దానినే 'అధిక మాసం' అంటారు. ఈ మాసంలో దేవతారాధనలు చేయడానికి విశిష్టత. కానీ శుభకార్యాలు చేయరాదు. దీనినే 'పురుషోత్తమ మాసం'అంటారు.

నిజ శ్రావణమాసం
శ్రావణమాసంలో తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి వారి గర్భగుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మాసంలో ప్రతి రోజు సాయంత్రం వేళల్లో భక్తులు అధికంగా బిల్వ దళాలతో (లక్షపత్రి) పూజను మహా శివున్ని పూజిస్తారు. ఒక జంటకు (భార్యభర్తలకు) రూ. 6వేల టికెట్‌తో ఒక రోజు ఐదుగురికి మాత్రమే ఈ పూజను నిర్వహిస్తారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుంది. రెండు నెలలు ఉండడంతో అధికంగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఆన్‌లైన్‌లో బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి వార్లకు భక్తులు అత్యధికంగా రూ.1000 టికెట్ చెల్లించి అభిషేక పూజలు నిర్వహిస్తారు. కాళేశ్వరం దేవస్థానం అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందదేవి(పార్వతీ), శ్రీసరస్వతీ అమ్మ వార్ల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు.

రెండు నెలలు దేవతారాధన చేయవచ్చు



ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండు నెలలు శ్రావణమాసం ఉంటుంది. ఈ రెండు నెలల్లో మొదటి అధిక శ్రావణమాసం, నిజ శ్రావణమాసాల్లో రెండు నెలలు దేవతామూర్తులకు పూజలు నిర్వహిస్తే చాలా మంచిది. కానీ అధిక మాసంలో శుభ కార్యాలు చేయద్దు. నిజశ్రావణమాసంలో శుభ కార్యాలకు అనుకూలం. ఈ రెండు మాసాల్లో ఆలయంలో లక్షపత్రి పూజలు నిర్వహిస్తే మహాశివుని కరుణ కటాక్షంతో ముక్తి లభిస్తుంది.

పనకంటి ఫణీంద్రశర్మ, ఆలయ ముఖ్యఅర్చకుడు

లక్షపత్రి పూజలకు సిద్ధం



ఈ ఏడాది అధిక, నిజ శ్రావణ మాసాలతో రెండు నెలలు లక్షపత్రి పూజలు చేసేందుకు అంతా సిద్ధం చేశాం. ఇప్పటికే బిల్వదళాలు తెచ్చేందుకు గిరిజనులను ఏర్పాటు చేశాం. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా లక్షపత్రి పూజలకు అడ్వాన్స్‌గా టికెట్ల కౌంటర్ ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా అర్చకులను ఏర్పాటు చేస్తాం. రద్దీతో ప్రసాదాల తయారీ చేస్తాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్నీ ఏర్పాటు చేస్తున్నాం.

ఎస్.మహేష్, ఈఓ, కాళేశ్వరం దేవస్థానం

రేవంత్, కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ టి.రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు

● మూడు గంటల కరెంట్ ఎలా సరిపోతది..
● క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం
● మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్ : రైతులను కించపరిచే విధంగా వ్యాఖ్యానించిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలు భేషరతుగా క్షమాపణలు చెప్పే వరకు తెలంగాణ వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. పైరవీలు, బ్రోకర్‌గా పనిచేసే రేవంత్‌రెడ్డి.. రైతులు, వారి సమస్యలపై అవగాహన లేక ఉచిత కరెంట్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ, నేతల తీరుపై ఇంకా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సోమవారం హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి దయాకర్‌రావు మాట్లాడారు. ఒకప్పుడు కరెంటు కష్టాలకు కారణమే కాంగ్రెస్సే అని టీడీపీలో ఉన్నప్పుడు తనతో కలిసి అసెంబ్లీ లోపల, ఎదుట ధర్నాలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ తరపున వకాల్తా పుచ్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కరెంట్ లేక ఎండిపోయిన పొలాలు చూసి భూమి ఉండంటే పిల్లను ఇవ్వలేదని, ఇప్పుడు భూమి ఉందంటేనే పిల్లనిచ్చే పరిస్థితి కేసీఆర్, బీఆర్‌ఎస్ పాలనలో వచ్చిందన్నారు. 'వ్యవసాయానికి కేవలం 3 గంటల కరెంటు చాలట. ఒక గంట కరెంటుతో ఒక ఎకరం పారించవచ్చట. వ్యవసాయం గురించి తెలిసినోడు మాట్లాడే మాటలేనా?.. రేవంత్‌రెడ్డికి అసలు సిగ్గుందా'అని మంత్రి దయాకర్‌రావు ప్రశ్నించారు. బేషరతుగా క్షమాపణలు చెప్పేదాకా విడిచిపెట్టబోమన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కడతారని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని విలేకరుల అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు తమ దరిదాపుల్లోనే లేవని.. రెండో స్థానం కోసం ఆ రెండు పార్టీలు పోటీపడుతున్నాయన్నారు. కాళేశ్వరం మహత్తర ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే ప్రతిపక్షపార్టీల నాయకులు రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. 'ఎక్కడ చూసినా ప్రాజెక్టుల్లో నీరు పారుతోంది.. చెరువులు, కుంటల్లో నీరు చేరి భూగర్భజలాలు పెరిగాయి.. భూముల ధరలు విపరీతంగా పెరిగింది. నేను కూడా రూ.2 లక్షల ఎకరం చొప్పున కొనుగోలు చేసిన భూమిని గత ఎన్నికల సమయంలో రూ.40 లక్షలకు ఎకరం చొప్పున అమ్మినా... ఇప్పుడా భూమి ధర ఎకరం రూ.కోటికి చేరింది. స్వరాష్ట్రంలో ఎనిమిదేళ్లలో జరిగిన అభివృద్ధి, మార్పులకు ఇవే నిదర్శనం'అని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, డా.టి.రాజయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సుందర్‌రాజు పాల్గొన్నారు.

నాగులమ్మ గుడిలో సూర్యుడి విగ్రహం

● గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి


రాతి విగ్రహాలను పరిశీలిస్తున్న రత్నాకర్‌రెడ్డి

కొడకండ్ల: జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని నాగులమ్మ గుడి ప్రాంగణంలో సూర్యుడి విగ్రహం గుర్తించినట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ధర్మకర్తలు సింగరం చంద్రయ్య, గోధుమల సోమయ్య, వెంకటయ్య ఆహ్వానం మేరకు నెలపోగుల సందీప్‌తో కలిసి రత్నాకర్‌రెడ్డి నాగులమ్మ కుంట, బయ్యన్నవాగు రిజర్వాయర్‌లో కలిసిన కునారెడ్డి కుంట పరిసరాలు, పాటిగడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం నాగులమ్మ గుడిలో సూర్యుడి విగ్రహం ఉన్నట్లు గతంలో గుర్తించామని, ఈ ఆలయానికి పైనుంచి వెలుతురు పడేలా రంధ్రం ఉందని చెప్పారు. ప్రస్తుతం నాగులమ్మ కుంటకట్ట మీద పూర్వపు నాగులమ్మ గుడికి అర ఫీటు మందం, మూడు మీటర్ల పొడవుతో ఉన్న రాళ్లను ఉపయోగించారని, కట్ట కింద ఉన్న గుడి కూడా ఇదే విధంగా నిర్మించారని చెప్పారు. ఆలయ శిథిలాల్లో నలుమూలలు ఉన్న రాయికి దీర్ఘ చతురస్రాకారంలో తొల్చిన రంధ్రం ఉన్నట్లు గుర్తించామని, ఇది సగభాగం మాత్రమే ప్రస్తుతం ఉందని వివరించారు. దీన్నిబట్టి ఆలయ శిథిలాలు సూర్య దేవాలయానికి చెందినవై ఉండొచ్చని అభిప్రాయ పడ్డారు. గతంలో బయ్యన్న ఆలయంలో ఎంతో అరుదైన బృహత్ శిలా యుగం నాటి మానవాకృత శిల్పం గుర్తించినట్లు పేర్కొన్నారు.

కాజీపేటలో 62 కిలోల గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను చూపిస్తున్న జీఆర్పీ సీఐ రాంమూర్తి, ఆర్పీఎఫ్ సీఐ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో రైల్వే పోలీసులు సోమవారం 62 కిలోల గంజాయిని పట్టుకున్నారు. జీఆర్పీ సీఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్ర కారం.. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 3లో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీ సులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా రైళ్లో గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఒడిశాకు చెందిన సక్రజిత్ ప్రధాన్, అజాది తంతిలను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. వీరి నుంచి సుమారు రూ.12,40,000 విలువ చేసే 31 ప్యాకెట్లలో సుమారు 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని కోర్టులో హాజరపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు, జీఆర్పీ ఎస్సై పరుశరాములు, పోలీసులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య


కళమ్మ (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని చక్రంతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కమ్మపల్లి గ్రామశివారు చక్రంతండాకు చెందిన అజ్మీరా కిషన్- కళమ్మ(45) దంపతులకు ఒక ఎకరం వ్యవసాయం భూమి ఉంది. వ్యవసాయంతో పాటు వ్యవసాయ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తునాడు. వీరి ఒక కుమారుడు రాజేందర్ దివ్యాంగుడు. కుమార్తె హారికకు వివాహమైంది. కిషన్-కళమ్మలకు ఆర్థిక విషయాల్లో తరుచూ గొడవ జరుగుతూ ఉండేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో క్షణికావేశానికి గురైన కళమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. కుటుంబ సభ్యులు చూసి వెంటనే నర్సంపేట ఆస్పత్రికి తరలించే లోపు మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

తడబడిన బుడిబుడి అడుగులు..

● తలకిందులుగా బకెట్‌లో పడి 11 నెలలు బాలుడి మృతి


హేమంత్ (ఫైల్)

రఘునాథపల్లి: బుడి బుడి అడుగులు తడబడ్డాయి. ప్రమాదవశాత్తు తలకిందులుగా బకెట్‌లో పడి 11 నెలల బాలుడు మృతిచెందాడు. ఈ విషాద ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్దిగ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎక్కలదేవి లక్ష్మణ్- గీత దంపతులకు ఇద్దరు కుమారులు గోవర్దన్, హేమంత్ (11నెలలు) ఉన్నారు. సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు టైలరింగ్ పనుల్లో నిమగ్నం కాగా చిన్న కుమారుడు హేమంత్ బుడి బుడి అడుగులతో ఇంటి వెనకాల నీళ్లతో ఉన్న బకెట్ వద్దకు వెళ్లి ఆడుతుండగా ప్రమాదవశాత్తు తలకిందులుగా బకెట్లో పడ్డాడు. బాలుడు కనిపించకపోయేసరికి ఇంటి వెనకాల వెతికిచూడగా బకెట్లో తలకిందులుగా పడి మృతిచెంది ఉన్నాడు. తల్లిదండ్రులు రోదిస్తూ వెంటనే బాలుడిని స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు చెప్పాడు. కళ్లముందే కుమారుడు ఆటాడుకుంటూ బకెట్‌లో పడి విగత జీవిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ విలపిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచివేసింది. ఎస్సై రఘుపతి ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ..


రాజు (ఫైల్)

కాశిబుగ్గ : ఆర్థిక సమస్యలతో ఓ కూలీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటలోని వడ్డెరకాలనీకి చెందిన శివరాత్రి రాజు(35) భార్య వనితతో కలిసి మట్టి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు మధ్యాహ్నం నర్సంపేట నుంచి వరంగల్‌కు వచ్చి తన బాబాయ్‌కు తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నాని తెలిపారన్నారు. అప్పటికే చింతలపల్లి, వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య వరంగల్ రైల్వేస్టేషన్ వెంబడి శివనగర్ వైపు ఉన్న వినాయక గుడి సమీపంలో అప్‌లైన్‌లో వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్‌ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతునికి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

స్నానానికి వెళ్లి కార్మికుడు గల్లంతు


రామ్‌సోరణ్ (ఫైల్)

నెక్కొండ: పొట్ట చేతపట్టుకొని ఉపాధి కోసం వచ్చిన ఓ హమాలీ కార్మికుడు స్నానానికి అని వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి గల్లంతైన సంఘటన మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్సై జానీపాష తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన హమాలీ కార్మికులు అన్నదమ్ములు పప్పు సురేణ్, రామ్‌సోరణ్ (22) నెక్కొండలోని చల్లా గోదాముల్లో పనులు చేసేందుకు రెండు నెలల క్రితం వచ్చారు. రోజు మాదిరిగానే రామ్‌సోరణ్ సమీపంలోని కుంటలో స్నానానికి ఒంటరిగా వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి కొట్టుకుపోతుండడంతో తోటి కార్మికులు దూరం నుంచి గమనించారు. వారు వెంటనే రక్షించే ప్రయత్నం చేసినప్పటికి కార్మికుడు నీట మునిగి గల్లంతయ్యాడని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి అన్న సురేణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై చెప్పారు. పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టినా అతడి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. తోటి కార్మికుడు నీట మునిగి గల్లంతు కావడంతో గోదాములో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌పరిధిలోని కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన అంబాల రవీందర్ కుమార్తె చందన కుట్టి (25) ఈనెల 3న రాత్రి తెల్లవారు జామున అందరు గాఢనిద్రలో ఉండగా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికారన్నారు. ఎక్కడా కూడా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డులో చోరీ

● రూ.80 వేల విలువ చేసే 19 ఎల్‌వీ కాయిల్స్ మాయం

పరకాల : పరకాల సబ్‌స్టేషన్ ఆవరణలోని ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డులో ఆదివారం రాత్రి దొంగలుపడ్డారు. విధులు ముగించుకొని వెళ్లిన సిబ్బంది సోమవారం ఉదయం 8 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ షెడ్డు తెరువగా రూ.82 విలువ చేసే 19ఎల్‌వీ కాయిల్స్ దొంగతనం జరిగినట్లు గుర్తించి షెడ్డు సబ్‌కాంట్రాక్టర్ భూరెడ్డి మధుసూదన్‌రెడ్డికి సమాచారం అందజేశారు. గుర్తుతెలియని వ్యక్తులు కిటికి నుంచి షెడ్డులోకి ప్రవేశించి చోరీకి పాల్పడగా మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం వ్యాన్


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన రాజేష్ మృతదేహం


క్యాబిన్‌లో ఆర్తనాదాలు చేస్తున్న మహిళలు

● క్యాబిన్‌లో ఇరుక్కుని వ్యాన్‌డ్రైవర్ మృతి
● నలుగురు మహిళలకు తీవ్రగాయాలు


రాజేష్(ఫైల్)

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సు నెమ్మదిగా వెళ్తున్న క్రమంలో అతివేగంగా వెనుకనుంచి డీసీఎం వ్యాన్ వచ్చి బస్సును బలంగా ఢీకొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా అందులో ఉన్న నలుగురి మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మంగ కథనం ప్రకారం.. తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్‌కు వెళ్లి తిరిగి వర్ధన్నపేట బస్టాండ్‌లోకి వెళ్లి తొర్రూరుకు వెళ్తున్న క్రమంలో వరంగల్ నుంచి పత్తి బేళ్లతో సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో అతివేగంగా వస్తూ అదుపు తప్పి ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్ తోట రాజేష్(40) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందగా క్యాబిన్‌లో ఉన్న పత్తి బేళ్లను దిగుమతి చేయడానికి వెళుతూ నలుగురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ములుగుకు చెందిన సింగం భారతి, వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన పోవుర్సు రజిత, ఆనుక మంజు, వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఎస్‌కె నసీం అలియాస్ ముంతాజ్ ఉన్నారు. వీరు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి సుమారు అర్ధగంటకు పైగా వీరు చేసిన ఆర్తనాదాలు పలువురిని కంటతడి పెట్టించాయి. క్యాబిన్ ముందు భాగంలో తాడు కట్టి క్యాబిన్‌ను ముందుకు లాగి వారిని అతి కష్టంగా బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో ఇద్దరిని తరలించగా మరో అంబులెన్సు రాకపోవడంతో ఎదురు చూసి వారిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడుది గీసుకొండ మండలం కీర్తినగర్. రాజేష్‌కు భార్య తిరుపతమ్మ ఉంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ అనుమాండ్ల సుధాకర్‌రెడ్డి వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సులో ప్రయాణికులు క్షేమం
ఆర్టీసీ బస్సులో కేవలం 15 మంది ప్రయాణికులు ఉండడం, వారు ముందు సీట్లలో కూర్చోవడంతో ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డారు. ఒక వేళ వెనుక సీట్లలో ప్రయాణికులు ఉంటే అతిపెద్ద ప్రమాదం చోటుచేసుకునేదని పలువురు చర్చించుకున్నారు.

ఆదర్శంగా మారాలంటే..

దేశంలో ఆదర్శ గ్రామాల అంటువ్యాధి రావాలి
● విమానంలో వెళ్లేవారు పైనుంచి గంగదేవిపల్లిని చూడాలి
● ఆదర్శగ్రామాలుగా రూపుదిద్దే సూచీని రూపొందిస్తున్నాం
● సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


గంగదేవిపల్లిలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గీసుకొండ: 'దేశంలోని గ్రామాలన్నీ గంగదేవిపల్లి, మరియపురంలా ఆదర్శంగా మారాలంటే..ఆదర్శ గ్రామాల అంటువ్యాధి రావాలి...అలాంటిది వస్తే అన్ని గ్రామాలు బాగుపడతాయి. దీని కోసం ఓ సూచీని తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాం' అని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం 'ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేది ఎలా' అనే అంశంపై తన పీహెచ్‌డీ థీసిస్ కోసం మండలంలోని గంగదేవిపల్లి , మరియపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రెండు గ్రామాల్లో ప్రజలతో సమావేశమై వారి అనుభవాలను, అభిప్రాయాలను ప్రశ్నావళి రూపంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గ్రామం ఆదర్శంగా నిలవడానికి గల కారణాలు, మిగతా గ్రామాలు ఆదర్శంగా ఎందుకు మారడం లేదో అనే విషయాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. జర్మనీలోని ఓ ఆదర్శ గ్రామం మీదుగా సమయంలో విమానాన్ని పైలెట్ తక్కువ ఎత్తులో తీసుకుని వెళ్తూ ఆ గ్రామం గురించి ప్రయాణికులకు చెబుతూ చూపిస్తారని, అలాగే గంగదేవిపల్లిని విమానాల్లో వెళ్లే వారు చూసే రోజులు వస్తాయన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీల విషయంలో దేశంలో తెలంగాణ ముందుందని, ఇటీవల ప్రకటించిన 19 కేంద్ర అవార్డుల్లో 12 అవార్డులు తెలంగాణ పల్లెలకు రావడం విశేషం అన్నారు. మహారాష్ట్రలో రాలేగావ్ సిద్ది గ్రామాన్ని అన్నా హజారే, హివ్రేబజార్‌ను కోకట్‌రావ్‌పవార్ ఆదర్శంగా తీర్చిదిద్దారని, అలాంటి కొందరి కృషితో పలుగ్రామాలు ఆదర్శంగా మారుతున్నాయని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, రాయపర్తి ఎంపీపీ అనిమిరెడ్డి, సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, అల్లం బాలిరెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, అంకతి నాగేశ్వర్‌రావు, జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, గోనె కుమారస్వామి, జాయిన్ ఫర్ డిపార్ట్‌మెంట్ సంస్థ జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, కవిత, పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

మరియపురం సర్పంచ్‌కు ప్రశంసలు
మరియపురంను జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా కేవలం నాలుగేళ్లలోనే తీర్చిదిద్దిన సర్పంచ్ అల్లం బాలిరెడ్డి సేవలను, కృషిని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అభినందించారు. సర్పంచ్‌తో పాటు గ్రామ మహిళల అభిప్రాయాలను ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళిలో ఆయన సేకరించారు.